# ప్రజాశక్తి

బుధవారం 5 జూన్ 2024

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి




# కూటమి క్లీన్ స్వీప్

◆ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో విజయఢంకా ◆ ఎక్కడా ఖాతా తెరవని వైసిపి

◆ విశాఖ ఎంపీ స్థానంలో శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ స్థానంలో సిఎం.రమేష్ విజయం ◆ టిడిపి, జనసేన, బిజెపి శ్రేణుల్లో జోష్

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి

టిడిపి - జనసేన - బిజెపి కూటమి విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో విజయఢంకా మోగించింది. 13 సీట్లకుగానూ అన్నింటినీ కూటమి అభ్యర్థులే కైవశం చేసుకున్నారు. విశాఖ జిల్లాలో విశాఖ పార్లమెంట్ సహా ఏడు అసెంబ్లీ సీట్లలోనూ కూటమినే గెలిచింది. అనకాపల్లి పార్లమెంట్ సహా ఆరు అసెంబ్లీలనూ కూటమే దక్కించుకుంది. వైసిపి పట్ల ప్రజావ్యతిరేక ఈ ఎన్నికల్లో ప్రస్ఫుటమైంది. కూటమి అభ్యర్థులు అన్నిచోట్లా మంచి మెజార్టీలతో విజయం సాధించారు. ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకొచ్చిన ఇండియా వేదిక అభ్యర్థులూ అక్కడక్కడా చెప్పుకోదగ్గ ఓట్లనే సాధించారు. (మిగతా 2లో..)

### విశాఖ తూర్పు



1.వెలగపూడి రామకృష్ణబాబు (టిడిపి) - 132047
2.ఎంవివి.సత్యనారాయణ (వైసిపి) - 61170
3.వి.శిరీష (ఇండిపెండెంట్) - 3508

### విశాఖ పశ్చిమ



1.పెతకంశెట్టి గణబాబు (టిడిపి) - 90805
2.ఆడారి ఆనంద్ కుమార్ (వైసిపి) - 55621
3.ఎ.రామచంద్రరావు (బిఎస్‌పి) - 1157

### విశాఖ దక్షిణం



1.సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ (జనసేన) - 97868
2.వాసుపల్లి గణేష్ కుమార్ (వైసిపి) - 33274
3.వి.సంతోష్‌కుమార్ (కాంగ్రెస్) - 3940

### భీమిలి



1.గంటా శ్రీనివాసరావు (టిడిపి) - 176230
2.ఎం. శ్రీనివాసరావు (వైసిపి) - 83829
3.ఎవి.వర్మరాజు (కాంగ్రెస్) - 5147

### గాజువాక



1.పల్లా శ్రీనివాసరావు (టిడిపి) - 157703
2.గుడివాడ అమర్‌నాథ్ (వైసిపి) - 62468
3.కెకె.ప్రదీప్ (ఇండిపెండెంట్) - 4316

### విశాఖ ఉత్తరం



1.పి.విష్ణుకుమార్ రాజు (బిజెపి) - 108801
2.కెకె.రాజు (వైసిపి) - 61267
3.వి.శిరీష - 5311

### పెందుర్తి



1.పంచకర్ల రమేష్‌బాబు (జనసేన) - 149611
2.అదీప్‌రాజ్ (వైసిపి) - 67741
3.పి.భగత్ - 4224

### అనకాపల్లి



1.కొణతాల రామకృష్ణ (జనసేన) - 115126
2.ఎం.భరత్ కుమార్ (వైసిపి) - 49362
3.ఐఆర్.గంగాధర్ (కాంగ్రెస్) - 1895

### యలమంచిలి



1.సుందరపు విజయ్‌కుమార్ (జనసేన)- 109443
2.కన్నబాబు రాజు (వైసిపి) - 60487
3.టిఎఆర్.నర్సింగరావు (కాంగ్రెస్) - 1822

### పాయకరావుపేట



1.వంగలపూడి అనిత (టిడిపి) - 120042
2.కంబాల జోగులు (వైసిపి) - 76315
3.బి.తాతారావు (కాంగ్రెస్) - 2087

### చోడవరం



1.కెఎస్ఎన్ఎస్.రాజు (టిడిపి)- 109651
2.కరణం ధర్మశ్రీ (వైసిపి) - 67462
3.జె.శ్రీనివాసరావు (కాంగ్రెస్) - 2527

### నర్సీపట్నం



1.సిహెచ్.అయ్యన్నపాత్రుడు (టిడిపి) - 99849
2.పి.ఉమాశంకర్ గణేష్ (వైసిపి) - 75173
3.బి.నాగరాజు (బిఎస్‌పి) - 1244

### మాడుగుల



1.బండారు సత్యనారాయణ మూర్తి (టిడిపి)- 91869
2.అనురాధ (వైసిపి) - 63843
3.బి.శ్రీనివాస్ (కాంగ్రెస్) - 1784


ఎంపీల ఫలితాలు

▶ లోపలి పేజీల్లో..

# కూటమి క్లీన్ స్వీప్

**విశాఖపట్నం పార్లమెంట్ స్థానం**



**1.ఎం.శ్రీభరత్ (టిడిపి) - 907467**
2.బొత్స ఝాన్సీలక్ష్మి (వైసిపి) - 403220
3.పి.సత్యారెడ్డి (కాంగ్రెస్) - 30267

**అనకాపల్లి పార్లమెంట్ స్థానం**



**1.సిఎం.రమేష్ (బిజెపి) - 750027**
2.బూడి ముత్యాలనాయుడు (వైసిపి) - 465539
3.వేగి వెంకటేష్ (కాంగ్రెస్) - 25651

(మొదటి పేజీ తరువాయి..)

విశాఖలోని ఎయు ఇంజినీరింగ్ కాలేజీలో విశాఖ పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు ప్రక్రియసాగగా తొలుత పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించగా అందులో టిడిపి, జనసేన, బిజెపి కూటమికే ఎక్కువ ఓట్లు దక్కాయి. ఇవిఎంలలోనూ కూటమి అభ్యర్థులకే ఎక్కువ పడ్డాయి. అసెంబ్లీలవారీగా చూస్తే విశాఖ తూర్పులో వెలగపూడి రామకృష్ణబాబు (టిడిపి)కి 132047 ఓట్లు, ఎంవివి.సత్యనారాయణ (వైసిపి)కి 61170 ఓట్లు వచ్చాయి. వెలగపూడి 92401 మెజార్టీతో గెలుపొందారు. విశాఖ పశ్చిమలో పి.గణబాబు (టిడిపి)కు 90805, ఆడారి ఆనంద్ కుమార్ (వైసిపి)కి 55621 ఓట్లు వచ్చాయి. గణబాబుకు 35184 మెజార్టీ వచ్చింది. విశాఖ దక్షిణంలో సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ (జనసేన)కు 97868, వాసుపల్లి గణేష్ కుమార్ (వైసిపి)కు 33274 ఓట్లు రాగా వంశీకృష్ణ 64594 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. భీమిలిలో గంటా శ్రీనివాసరావు (టిడిపి)కు 176230, ముత్తంశెట్టి శ్రీనివాసరావు (వైసిపి)కి 83829 ఓట్లు వచ్చాయి. 92401 మెజార్టీతో గంటా విజయఢంకా మోగించారు. గాజువాకలో పల్లా శ్రీనివాసరావు (టిడిపి)కు 157703, గుడివాడ అమర్‌నాథ్ (వైసిపి)కు 62468 ఓట్లు రాగా పల్లాకు 95235 మెజార్టీ వచ్చింది. విశాఖ ఉత్తరంలో పి.విష్ణుకుమార్ రాజు (బిజెపి)కు 108801, కెకె.రాజు (వైసిపి)కి 61267 ఓట్లు వచ్చాయి. విష్ణుకుమార్ రాజుకు 47534 మెజార్టీ దక్కింది. పెందుర్తిలో పంచకర్ల రమేష్‌బాబు (జనసేన)కు 149611, అదీప్‌రాజ్ (వైసిపి)కు 67741 ఓట్లు వచ్చాయి. పంచకర్లకు 81870 మెజార్టీ వచ్చింది.

**అనకాపల్లిలో వైసిపి ఘోర పరాభావం**

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో వైసిపి ఘోర పరాభావం పాలైంది. ఆరు అసెంబ్లీ స్థానాల్లో నాలుగు చోట్ల టిడిపి గెలిచింది. రెండు చోట్ల జనసేన బోణీ కొట్టింది. ఫ్యూచర్ వరల్డ్ స్కూల్‌లో మంగళవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ప్రారంభమైన ఓట్ల లెక్కింపు మొదలుకొని తరువాత ఇవిఎంలు లెక్కించిన ప్రతి రౌండ్‌లోనూ కూటమి తరపున పోటీ చేసిన టిడిపి, జనసేన అభ్యర్థులు ఆధిక్యం సాధిస్తూ విజయం సాధించారు. మంత్రులు బూడి ముత్యాల నాయుడు, గుడివాడ అమర్‌నాథ్ ఓటమి చవిచూశారు. అనకాపల్లి లోక్ సభకు పోటీచేసిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ముత్యాల నాయుడు బిజెపి అభ్యర్థి సిఎం రమేష్ చేతిలో ఓటమి చెందారు. రెండోసారి అనకాపల్లి నుంచి పోటీకి అవకాశం ఇవ్వకపోవడంతో గాజువాక నుంచి పోటీచేసిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్, టిడిపి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు చేతిలో పరాజయం పాలయ్యారు. జిల్లాలో 2019 ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ సహా చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి, అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయం సాధించిన వైసిపి ఈ సార్వత్రిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ ఓడిపోయింది.

జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అనకాపల్లి, యలమంచిలి నుంచి జనసేన తరపున పోటీచేసిన కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్ గెలుపొందగా, పాయకరావుపేట, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నుంచి టిడిపి తరపున పోటీ చేసిన వంగలపూడి అనిత, చింతకాయల అయ్యన్నపాత్రుడు, కెఎస్ఎన్ఎస్.రాజు, బండారు సత్యనారాయణ మూర్తి ఊహించని మెజార్టీ సాధించారు. కొత్తగా అసెంబ్లీలో యలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయ కుమార్ అడుగు పెట్టనున్నారు. లెక్కింపు ఫలితం కూటమికి అనుకూలంగా రావడంతో యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు, అనకాపల్లి వైసిపి అభ్యర్థి మలసాల భరత్ కుమార్ లెక్కింపు కేంద్రం నుంచి మధ్యలోనే వెళ్లిపోయారు.

**అంచనాలకు మించి మెజార్టీ**

జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి గెలిచిన కూటమి అభ్యర్థులు 25 వేలకుపైగా మెజార్టీతో గెలిచారు. పోటా పోటీలో ఎవరు గెలిచినా తక్కువ మెజార్టీతో గెలుస్తారన్న అంచనాలకు మించి ఆధిక్యత సాధించారు. ఎవరి ఊహకూ అందని విధంగా ఓట్లు వచ్చాయి. అత్యధికంగా అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ 65,764 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. యలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయ కుమార్ కూడా 48,956 ఓట్లు మెజార్టీతో ద్వితీయ స్థానంలో వున్నారు. వంగలపూడి అనిత 43,727, కెఎస్ఎన్ఎస్.రాజు 42,189 ఓట్ల మెజార్టీతో గెలిచారు. కూటమి నుంచి గెలిచిన అరుగురిలో తక్కువ ఓట్లతో అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణ మూర్తి విజయం సాధించారు. అయ్యన్నపాత్రుడు 24,676 ఓట్లు, బండారు 28,026 ఓట్లు మెజార్టీతో గెలిచారు.

జిల్లాలో పాయకరావుపేట టిడిపి అభ్యర్థి వంగలపూడి అనిత 43,727 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. వైసిపి అభ్యర్థి కంబాల జోగులుకు వచ్చిన 76,315 (36.78 శాతం) ఓట్లలో ఇవిఎం ఓట్లు 75,614 ఓట్లు, పోస్టల్ ఓట్లు 701 రాగా, వంగలపూడి అనితకు వచ్చిన 1,20,042 (57.86 శాతం) ఓట్లలో ఇవిఎం ఓట్లు 1,18,675, పోస్టల్ ఓట్లు 1367 వచ్చాయి. చోడవరం టిడిపి అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజుకు వచ్చిన 1,09,651 (59.03) ఓట్లలో ఇవిఎం 1,07,81 ఓట్లు, పోస్టల్ ఓట్లు 1780 వచ్చాయి. వైసిపి అభ్యర్థి కరణం ధర్మశ్రీకి వచ్చిన 67,462 (36.32శాతం) ఓట్లలో ఇవిఎం ఓట్లు 66,706 పోస్టల్ ఓట్లు 756 వచ్చాయి. రాజు 42,189 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. మాడుగుల నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి బండారు సత్యనారాయణ మూర్తి 28,026 ఓట్లు మెజార్టీ సాధించారు. బండారుకు వచ్చిన 91,869 (55.6 శాతం) ఓట్లలో ఇవిఎం ఓట్లు 90,092, పోస్టల్ ఓట్లు 1777 నమోదయ్యాయి. వైసిపి అభ్యర్థి ఈర్లే అనురాధకు 63,843 (38.64 శాతం) ఓట్లు వచ్చాయి. వీటిలో ఇవిఎం ఓట్లు 63,018, పోస్టల్ ఓట్లు 825 ఉన్నాయి. అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ 65,764 ఓట్ల మెజార్టీతో గెలిచారు. కొణతాల వచ్చిన 1,15,126 (66.63 శాతం) ఓట్లలో పోస్టల్ ఓట్లు 1941, ఇవిఎం ఓట్లు 1,13,185 వచ్చాయి. వైసిపి అభ్యర్థి మలసాల భరత్ కుమార్‌కు వచ్చిన 49,362 (28.57 శాతం) ఓట్లలో ఇవిఎం ఓట్లు 48,652, పోస్టల్ ఓట్లు 710 వచ్చాయి. యలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయ కుమార్ 48,957 ఓట్ల ఆధిక్యత సాధించారు. ఇతనికి వచ్చిన 1,09,443 (61 శాతం) ఓట్లలో ఇవిఎం ఓట్లు 1,08,080, పోస్టల్ ఓట్లు 1363 వచ్చాయి. వైసిపి అభ్యర్థి యువి రమణమూర్తి రాజుకు వచ్చిన 60,487 (33.71 శాతం) ఓట్లలో పోస్టల్ ఓట్లు 674, ఇవిఎం ఓట్లు 59,813 వచ్చాయి.

నర్సీపట్నం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి సిహెచ్.అయ్యన్నపాత్రుడు 24,676 ఓట్లతో విజయం సాధించారు. ఆయనకు వచ్చిన 99,849 (54.6 శాతం) ఓట్లలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1888, ఇవిఎం ఓట్లు 97,961 వచ్చాయి. వైసిపి అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు వచ్చిన 75,173 (41.11 శాతం ) ఓట్లలో ఇవిఎం ఓట్లు 74,101, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1072 నమోదయ్యాయి.



విశాఖలో సంబరాల్లో కూటమి మహిళా అభిమానులు

## అనకాపల్లి పార్లమెంట్ స్థానంలో ఓట్లు ఇలా..

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : అనకాపల్లి లోక్‌సభ బిజెపి అభ్యర్థి సిఎం రమేష్ భారీ మెజారిటీతో వైసిపి అభ్యర్థి బూడి ముత్యాల నాయుడుపై గెలుపొందారు. మొత్తం పోలైన 13,25,332 ఓట్లలో రమేష్‌కు వచ్చిన 7,62,069 (57.51 శాతం) ఓట్లలో ఇవిఎం ఓట్లు 7,50,027 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 12,042 ఓట్లు వచ్చాయి. బూడికి వచ్చిన 4,65, 539 (35.19 శాతం) ఓట్లలో ఇవిఎం ఓట్లు 4,59,762, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 5,777 వచ్చాయి. బూడిపై 2,96,530 ఓట్ల మెజార్టీతో రమేష్ విజయం సాధించారు. లోక్ సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో లెక్కింపు ఆరంభం నుంచి తుది రౌండ్ వరకు అదే ఆధిక్యత రమేష్ కనబరిచారు. పోస్టల్ బ్యాలెట్‌లోనూ మెజార్టీ ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థి వేగి వెంకటేష్‌కు వచ్చిన 25,651 ఓట్లలో (1.94 శాతం) ఇవిఎం ఓట్లు 24,833, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 818 వచ్చాయి.



అనకాపల్లిలో బందోబస్తును పర్యవేక్షిస్తున్న గ్రేహౌండ్స్ అదనపు డిజిపి ఆర్‌కె.మీనా

## ప్రశాంతంగా ముగిసిన ఓట్ల లెక్కింపు

**- ఊపిరి పీల్చుకున్న అధికారులు**

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. ఫ్యూచర్ వరల్డ్ స్కూల్‌లో చేపట్టిన కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భారీగా పోలీసులను మోహరించారు. లెక్కింపు కేంద్రానికి వచ్చే వారిని తనిఖీచేసి పోలీసులు లోపలకు పంపించారు. గొడవలు జరగకుండా లెక్కింపు ప్రశాంతంగా పూర్తవడంతో ప్రభుత్వ యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. జిల్లాలో కంట్రోల్ రూమ్ నుండి శాంతి భద్రతలను ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పర్యవేక్షించారు.

జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. డ్రోన్ లతో నిఘా పెట్టారు. బుధవారం కూడా జిల్లా వ్యాపితంగా 144 సెక్షన్ కొనసాగనుంది. పోలీసు పికెట్ ఏర్పాటుచేసి, పెట్రోలింగ్ కొనసాగిస్తున్నారు. ప్రజలు గుమి కూడకుండా పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. లెక్కింపు ఏర్పాట్లు, బందోబస్తును విశాఖపట్నం గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ ఆర్.కె.మీనా పరిశీలించారు. జనరల్ అబ్జర్వర్ రాకేష్ కుమార్, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ వున్నారు.

## కెఎ.పాల్‌కు ఎక్కడెన్ని ఓట్లు!

ప్రజాశక్తి- విశాఖపట్నం : ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కిలారి ఆనంద్ పాల్ (కెఎ.పాల్) ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ ఎంపీ, గాజువాక అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేశారు. మట్టికుండ గుర్తుపై బరిలోకి దిగి తనదైన రీతిలో వినూత్నంగా ప్రచారం చేసి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నమే చేశారు. విశాఖ పార్లమెంట్ స్థానంలో 7696 ఓట్లు సాధించారు. ఇక గాజువాక అసెంబ్లీ స్థానంలో 1700 ఓట్లు సాధించి, ఐదోస్థానంలో నిలిచారు.

## సిబిఐ మాజీ జెడి లక్ష్మీ నారాయణకు 5160 ఓట్లు

ప్రజాశక్తి- విశాఖపట్నం : వైసిపి అధినేత జగన్మోహనరెడ్డి ఆర్థిక నేరాల కేసులో దర్యాప్తు అధికారిగా విశేష ప్రాచుర్యం పొందిన సిబిఐ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేయగా ఆయనకు 5160 ఓట్లు దక్కాయి. ఐదో స్థానంలో నిలిచారు. గడచిన ఎన్నికల్లో జనసేన తరపున విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి ఆయన ఓటమిపాలైన విషయం తెలిసిందే.

## సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్సకు ఆదరణ

ప్రజాశక్తి - పాడేరు : సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్సకు ఏజెన్సీ అంతటా అపూర్వ ఆదరణ లభించింది. అరకు పార్లమెంట్ స్థానంలో బిజెపి అభ్యర్థి కొత్తపల్లి గీతపై వైసిపి అభ్యర్థి గుమ్మ తనూజా రాణి 50,580 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తనూజ రాణికి మొత్తం 4,77005 ఓట్లు, బిజెపి అభ్యర్థి కొత్తపల్లి గీతకు 4,26,425 ఓట్లు నమోదయ్యాయి. మూడో స్థానంలో నిలిచిన సిపిఎం అభ్యర్థి అప్పలనర్సకు 1,23,129 ఓట్లు వచ్చాయి. ఆ తరువాత స్థానంలో బహుజన సమాజ్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. ఈ స్థానంలో మొత్తం 13 మంది అభ్యర్థులు పోటీ చేశారు. గెలుపుకోసం వైసిపి, బిజెపి అభ్యర్థులు, పార్టీలు ఓటర్లకు కోట్లది రూపాయిలు ఎరజూపారు. గిరిజనులను, మైదాన ప్రాంత ప్రజానీకాన్ని మద్యం మత్తులో ముంచారు. సిపిఎం అభ్యర్థికోసం ఆ పార్టీ ప్రచార సామగ్రికి మినహా ఇతర ఖర్చులేవీ పెట్టకపోయినప్పటికీ లక్ష ఓట్లు దాటి రావడం గమనార్హం. దీన్నిబట్టి గతం కన్నా సిపిఎం పార్టీకి ఆదరణ పెరిగిందన్నది అర్థమవుతోంది. ఈ మేరకు వైసిపి, టిడిపి, బిజెపి, జనసేన కూటమి అభ్యర్థికి ఓట్లు తగ్గాయి. నోటాకు 50,470 ఓట్లు పోలయ్యాయి. సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స గిరిజనులు, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. గిరిజనుల రిజర్వేషన్లు కొనసాగింపుపై, జిఒ నెంబర్ 3 రద్దుకు వ్యతిరేకంగా గిరిజన సంఘం చేసిన పోరాటంలో ఆయన కీలకపాత్ర పోషించారు.

**అల్లూరి జిల్లాలో అప్పలనర్సకు వచ్చిన ఓట్లు**

అప్పలనర్స పార్టీలకతీతంగా అల్లూరి జిల్లాలో వివిధ తరగతుల ఓటర్ల ఆదరాభిమానాలు చూరగొన్నారు. అరకు, పాడేరు, రంపచోడవరం అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓటర్ల నుంచి అపూర్వ ఆదరణ ఆయనకు లభించింది. ఈ మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో అప్పలనర్స గెలుపు కోసం వివిధ ఆదివాసీ తరగతులు స్వచ్ఛందంగా, విశేషంగా కృషి చేశాయి. అప్పలనర్సకు అరకు సెగ్మెంట్‌లో 45 వేలా 19 ఓట్లు వచ్చాయి. ఇవి బిజెపి అభ్యర్థి కంటే ఎక్కువ ఓట్లు. ఆయన రెండో స్థానంలో ఆ నియోజకవర్గంలో నిలిచారు. అలాగే పాడేరు అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి 27 వేలా 700 ఓట్లు, రంపచోడవరం అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి 24 వేలా 847 ఓట్లు సాధించి లక్ష మార్కును దాటారు. ఆదివాసీల్లో సిపిఎంకు ఉన్న పట్టు ఈసారి నిరూపితమైంది.

# భీమిలిలో గంటా విజయం

## 92,401 ఓట్లు ఆధిక్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం

ఎన్నికల వ్యూహం, కార్యాచరణ, ప్రచార శైలిలో... ఇలా ప్రతి దశలోనూ కూటమి (టిడిపి) అభ్యర్థి గంటా శ్రీనివాసరావు తనదైన శైలిలో ఎన్నికల క్షేత్రంలో నిలిచి ఘన విజయం సాధించారు. రాష్ట్రంలో అతిపెద్ద నియోజకవర్గం భీమిలిలో గంటా శ్రీనివాసరావుకు 1,76,230 ఓట్లు రాగా, తన సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు 83,829 ఓట్లు వచ్చాయి. ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై 92,401 ఓట్ల మెజారిటీతో గంటా శ్రీనివాసరావు ఘన విజయం సాధించారు.

**గెలుపునకు కారణాలు ఇవీ...**

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వ్యవహార శైలిపై పార్టీ క్యాడర్‌లో గుంభనంగా గూడు కట్టుకున్న అసంతృప్తి, ప్రభుత్వంపై ఉద్యోగులు, ఎగువ, మధ్య తరగతి ప్రజల్లో ఉన్న వ్యతిరేకత తోడవ్వడం, రాష్ట్ర స్థాయిలో ప్రధానంగా కూటమి కట్టడం వెరసి గంటా విజయానికి ముఖ్య కారణాలుగా రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. వీటన్నింటికి మించి సూపర్ సిక్స్ పథకాలు ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు ఇచ్చాయని పలువురు భావిస్తున్నారు. యువతకు ఏడాదికి 20లక్షల ఉపాధి అవకాశాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఏటా రైతుకు రూ.20 వేలు ఆర్థిక సాయం, పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు లాంటి సంక్షేమ పథకాలు టిడిపికి ఓట్లు రాల్చాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై టిడిపి ప్రచారంతో, రైతుల్లో వైసిపి ప్రభుత్వం పట్ల బాగా వ్యతిరేకత వచ్చినట్లు ఇట్టే స్పష్టం అవుతోంది.

**టిడిపికి పెట్టని కోట...**

పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీకి భీమిలి కంచుకోటగానే చెప్పవచ్చు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి అంటే 1983, 1985, 1989, 1994, 1999, 2014లో విజయాలు సాధిస్తూ వచ్చింది. 2004లో కాంగ్రెస్, 2009లో ప్రజారాజ్యం, 2019లో వైసిపి గెలిచాయి.

**ఓటమి ఎరుగని గంటా..**

గంటా శ్రీనివాసరావు సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఓటమి లేదనే చెప్పాలి. 1999లో అనకాపల్లి ఎంపీగా, 2004లో చోడవరం ఎమ్మెల్యేగా, 2009లో అనకాపల్లి ఎమ్మెల్యేగా, 2014లో భీమిలి ఎమ్మెల్యేగా,2019లో విశాఖ ఉత్తర ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2024లో మళ్లీ రెండో సారి భీమిలి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

**చివర్లో టిక్కెట్టు..**

టిడిపి అధిష్ఠానం గంటాకు టికెట్టు కేటాయించేందుకు తొలుత తటపటాయించినప్పటికీ తుదకు ఆయనకే టిక్కెట్టు కేటాయించింది. మార్చి 29న టిక్కెట్టు కేటాయించగా, కేవలం 40 రోజుల వ్యవధిలోనే నియోజక వర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి ముఖ్య నేతలను టిడిపిలోకి రప్పించడంలోనూ, బిజెపి, జనసేన నేతలను టిడిపి నేతలతో సమన్వయం చేయించడంలోనూ గంటా అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారని ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.



## నేరాలు ఘోరాలు

### మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మానసిక్థితి సక్రమంగా లేదని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు పి.ఎం.పాలెం పోలీసుస్టేషన్ సిఐ వై.రామకృష్ణ తెలిపారు. జివిఎంసి ఆరో వార్డు పరిధి కొమ్మాది రిక్షాకాలనీలో యమున (30) భర్త యయతితో కలిసి నివాసముంటున్నారు. వీరిని ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త విధులకు వెళ్లిన తరువాత మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో చీరతో ఇంట్లోనే ఫ్యాన్ హుక్‌కు ఉరివేసుకొని యమున ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ తెలిపారు. మృతురాలు తండ్రి భాస్కరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ఎవరూ లేక బోసిపోయిన వైసిపి కార్యాలయం

### కళతప్పిన వైసిపి కార్యాలయం

ప్రజాశక్తి- మధురవాడ : సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలవడుతున్న తరుణంలో మంగళవారం వైసిపి కార్యాలయం కళ తప్పింది. ఎండాడలో ఉన్న వైసిపి కార్యాలయం మంగళవారం ఉదయం పార్టీ కార్యకర్తలతో కళకళలాడింది. ఎన్నికల ఫలితాలను చూసేందుకు కార్యాలయంలో తెర ఏర్పాటుచేశారు. ఎన్నికల ఫలితాలు విక్షించారు. ఫలితాలు నిరాశాజనకంగా ఉండటంతో నిరుత్సాహానికి గురైన కార్యకర్తలు ఒక్కొక్కరుగా వెనుదిరిగి వెళ్లిపోయారు. మధ్యాహ్నానికి పార్టీ కార్యాలయం బోసిపోయింది.

## టిడిపి సంబరాలు

ప్రజాశక్తి- ఆనందపురం : సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం అఖండ విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఆనందపురంలో తెలుగుదేశం భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు ఆధ్వర్యాన కార్యకర్తలు బాణా సంచాలు పేల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. జనసేన మండల పార్టీ అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. బిజెపి మండల పార్టీ అధ్యక్షులు మీసాల రామనాయుడు ఆధ్వర్యాన కూటమి విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. తర్లువాడలో సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, గండిగుండం మాజీ డైరెక్టర్ సోంబాబు, జి.రమేష్, తర్లువాడ జడ్‌పిటిసి అభ్యర్థి తాత్రాజు అప్పారావు, గంభీరం పంచాయతీలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి ముత్యాలరావు, దిబ్బడపాలెంలో ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ తదితరులు సంబరాలు జరుపుకున్నారు

## ప్రజాతీర్పును శిరసావహిస్తా : కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన ప్రజా తీర్పును శిరసావహిస్తానని ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ ఫలితాలను చూసి ఎవరూ అధైర్యపడవద్దని, ప్రతి కార్యకర్తకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యకర్తలను ఓదార్చారు. ఈ ఎన్నికల్లో తన వెంటే ఉంటూ రాత్రింబవళ్ల కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకూ రుణపడి ఉంటానన్నారు.

# 'ఉత్తరం'లో విష్ణుకుమార్‌రాజుకు పట్టం



ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు విజయం సాధించారు. విష్ణుకుమార్‌రాజుకు 1,08,801 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి కెకె.రాజుకు 61267 ఓట్లు వచ్చాయి. ఈ నియోజకవర్గం నుంచి పోటీచేసిన సిబిఐ మాజీ జేడీ వివి.లక్ష్మీనారాయణకు 5160 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి లక్కరాజు రామారావుకు 4252 ఓట్లు వచ్చాయి. కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు సమీప వైసిపి అభ్యర్థి కెకె.రాజుపై 47534 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

బిజెపి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో విజయం సాధించినట్లు కూటమి నాయకులు తెలిపారు. 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా ఉన్న విష్ణుకుమార్‌రాజుపై అవినీతి ఆరోపణలు లేకపోవడం, ఎన్నికల సమయంలో చంద్రబాబు ఉత్తరంలో బహిరంగ సభ ఏర్పాటుచేయడం విష్ణుకుమార్‌రాజుకు కలిసొచ్చాయి.



విజయ దరహాసంతో పంచకర్ల రమేష్‌బాబు

# ఓటర్లకు అభినందనలు : రమణ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని 22 పంచాయతీలకుగాను 21 పంచాయతీలలో మెజారిటీ తెచ్చిపెట్టిన ఓటర్లకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కె.రమణ కృతజ్ఞతలు తెలిపారు. పద్మనాభంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు అందరూ సమిష్టిగా కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గెలుపునకు కృషిచేశారన్నారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి మాజీ సభ్యుడు కె.దామోదరరావు, మాజీ ఎంపిపి డి.గోపీబాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు కెవి.సత్యనారాయణ, మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు పివి.రమణ, ఇతర నాయకులు ఈగల శ్రీరామ్మూర్తి, అప్పలనాయుడు, రమణ, ప్రసాద్ కె.ఎర్రినాయుడు, కె.శ్రీను, పుప్పాల వంశీ తదితరులు పాల్గొన్నారు.



గంటాకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఇసుకలపాలెం కూటమి నాయకులు

**గంటాను కలిసిన ఇసుకలపాలెం కూటమి నాయకులు**

పద్మనాభం పంచాయతీ పరిధిలోని ఇసుకలపాలెం గ్రామానికి చెందిన టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు మంగళవారం విశాఖపట్నం వెళ్లి గంటా శ్రీనివాసరావును కలిశారు. విజయం సాధించిన సందర్భంగా గంటాకు అభినందనలు తెలియజేశారు.

టిడిపికి చెందిన దంతులూరు గోపాలకృష్ణమూర్తి రాజు, గోపిబాబు ఆధ్వర్యాన మండల నాయకులు, కార్యకర్తలు ప్రత్యక్ష సమావేశమయ్యారు. అనంతరం గంటా శ్రీనివాసరావును కలిసేందుకు విశాఖ వెళ్లారు.

# పెందుర్తిలో పంచకర్ల విజయం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం నుంచి కూటమి మద్దతుతో పోటీచేసిన జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు విజయం సాధించారు. మొదటి రౌండ్ నుంచి చివరి 21వ రౌండ్ వరకు ప్రతి రౌండ్‌లోను ఆధిక్యత కనబరుస్తూ వచ్చారు. పంచకర్ల రమేష్‌బాబుకు 1,49,611 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజుకు 67741 ఓట్లు వచ్చాయి.

గత ఎన్నికల్లో అన్నంరెడ్డి అదీప్‌రాజు వైసిపి నుంచి గెలుపొందినా నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై దృష్టిసారించకపోవడం, తాడి గ్రామం తరలింపును, పంచ గ్రామాల సమస్యను పట్టించుకోకపోవడం, సమస్యలపై నేరుగా ఎమ్మెల్యేను కలిసినా చాలావరకు పనులు జరగకపోవడం, ప్రతి వార్డులో కార్యకర్తలపై అసహనం చూపడం తదితరాలు అదీప్‌రాజు ఓటమికి దారితీశాయి. అదీప్‌రాజుపై వ్యతిరేకతతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వీచిన కూటమి గాలికితోడు యువకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో ఓటును వినియోగించుకోవడం కూటమి అభ్యర్థికి కలిసి వచ్చిన అంశంగా పలువురు చర్చించుకుంటున్నారు.

**సంబరాలు**

వేపగుంట, పెందుర్తి, చినముషిడివాడ తదితర ప్రాంతాల్లో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు ఆయా కార్యాలయాలు, గృహాలు, వీధుల్లోనూ సంబరాలు జరుపుకున్నారు. కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబును పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



తూర్పు నుంచి గెలుపొందిన వెలగపూడి రామకృష్ణబాబుకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న పరిశీలకులు అమిత్‌శర్మ

# వెలగపూడికి కలిసొచ్చిన వైసిపి అసమ్మతి

### వరుసగా నాలుగోసారి తూర్పు ఎమ్మెల్యేగా విజయం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రాష్ట్రంలో ప్రభుత్వమేదైనా, అనునిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించిన వెలగపూడి రామకృష్ణబాబును తూర్పు ఎమ్మెల్యేగా వరుసగా నాలుగోసారి ప్రజలు గెలిపించారు. వైసిపిలోని అసమ్మతి వెలగపూడి అఖండ విజయానికి దోహదపడ్డాయి.

వెలగపూడి విజయానికి తూర్పులోని ప్రత్యర్థి వైసిపిలోని అసమ్మతి, చీలికలు బాగా కలిసొచ్చాయనే చెప్పాలి. యాదవ సామాజిక వర్గానికి చెందిన వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్ వైసిపిని వీడి జనసేనలో చేరడం, గత ఎన్నికల్లో తూర్పులో వెలగపూడికి ప్రత్యర్థిగా పోటీలో నిలిచిన అక్కరమాని విజయనిర్మల, ఆ మె భర్త వెంకటరావు వైసిపికి గుడ్‌బై చెప్పి టిడిపిలో చేరడం, వీరితోపాటు ప్రజాదరణ కలిగిన కంచర్ల అచ్యుతరావు, 18వ వార్డు కార్పొరేటర్ పూశర్ల ధనలక్ష్మిశంకర్ వంటి వైసిపినేతలు పార్టీని వీడి టిడిపిలో చేరడం కూటమి బలోపేతానికి కలిసొచ్చింది. తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసిపి బరిలోనిలిపిన ఎంవివి సత్యనారాయణ, విశాఖ ఎంపీగా హయగ్రీవ వంటి పలు భూ కుంభకోణాలకు పాల్పడడం, ఎంవివి కుటుంబ కిడ్నాప్ వ్యవహారం, కిందిస్థాయి కేడరును పట్టించుకోకపోవడం, ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో పలువురు కార్పొరేటర్లు కిందిస్థాయి నాయకులతో గొడవలు, ఎంపీగా గెలిచిన నాటి నుండి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించే వరకు పెద్దగా ప్రజల్లోకి రాకపోవడం వంటివి వైసిపికి ప్రతికూలంగా మారాయి.

ఎన్నికల ముందు రోజు నగదు పంపిణీ వ్యవహారం రచ్చకెక్కడం, జాలారిపేట, అప్పుఘర్, వాసవానిపాలెం నుండి వందల సంఖ్యలో ప్రజలు సాక్షాత్తు ఎంవివి ఇంటిని ముట్టడించి నిలదీయడం తీవ్ర ప్రభావాన్ని చూపాయనే చెప్పాలి. తూర్పు సమన్వయకర్తగా ప్రకటించిన తర్వాత 120 రోజులు పాదయాత్ర చేసినా ప్రజలు నమ్మకాన్ని ఎంవివిపొందలేకపోయాడు. అంతేకాక అరకొరగాసంక్షేమ పథకాలు అందడం వంటివిని ఎంవివి ఓటమిపై తీవ్ర ప్రభావాన్ని చూపాయనే చెప్పాలి.

# గాజువాకలో పల్లా విజయం

### 95235 ఓట్ల ఆధిక్యం

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక నియోజకవర్గం నుంచి తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా పోటీచేసిన పల్లా శ్రీనివాసరావు ఘన విజయం సాధించారు. పల్లా శ్రీనివాసరావుకు 1,57,703 ఓట్లు రాగా సమీప వైసిపి అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు 62,468 ఓట్లు వచ్చాయి. ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం అభ్యర్థి ఎం.జగ్గునాయుడుకు 3970 ఓట్లు వచ్చాయి. గుడివాడ అమర్‌నాథ్‌పై 95235 ఓట్ల ఆధిక్యంతో పల్లా శ్రీనివాసరావు గెలుపొందారు.

పల్లా శ్రీనివాసరావు 2019వ సంవత్సరంలో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన తర్వాత నియోజకవర్గ ప్రజలు ఆయన పట్ల సానుకూల స్వభావం చూపిస్తూ వచ్చారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లా శ్రీనివాసరావుపై కక్ష సాధింపు చర్యలు చేపట్టింది. పాత గాజువాక జంక్షన్లో ఆయన షాపింగ్ కాంప్లెక్స్‌ను నేలకూలదీయడం వంటి పరిణామాలు కూడా పల్లా శ్రీనివాసరావుకు కలిసి వచ్చాయి. పల్లా శ్రీనివాసరావు యాదవ సామాజిక వర్గం చెందిన వారు కావడం, గాజువాకలో ఎక్కువ శాతం యాదవులు ఉండటంతో వారందరూ ఆయన్ను గెలిపించుకునేందుకు కష్టపడ్డారు. పవన్‌కల్యాణ్‌తో పొత్తు కూడా పల్లా గెలుపుకు కలిసి వచ్చింది. వైసిపి తరపున పోటీచేసిన గుడివాడ అమర్‌నాథ్‌పై గాజువాక ప్రజల్లో మంచి అభిప్రాయం లేదు. గుడివాడ అమర్‌నాథ్‌కు గాజువాక టికెట్టు ఇవ్వడాన్ని తిప్పల నాగిరెడ్డి గ్రూపు జీర్ణించుకోలేకపోయింది. దీంతో వారు రహస్యంగా పల్లాకు మద్దతిచ్చారని ప్రచారం జరిగింది. పల్లా శ్రీనివాసరావు ముందుగా క్యాడర్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించేలా ఆర్థిక సహాయం చేశారు. దీంతో క్యాడర్ కూడా గతంలో వలె కాకుండా పల్లా గెలుపునకు గట్టిగా కష్టపడ్డారు. వైసిపిలో క్యాడర్‌ను పట్టించుకోకపోవడం, ఎన్నికల్లో వారికి ఎలాంటి ఆర్థిక సహాయం చేయకపోవడంతో చాలామంది పల్లాకే ఓటు వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి గాలి కూడా గాజువాకలో పనిచేసింది. చంద్రబాబు గాజువాకలో సభ పెట్టడం, గత సంవత్సరం పవన్‌కల్యాణ్ రావడం ఇవన్నీ కలిసొచ్చాయి. వ్యాపారులు, ఉద్యోగులు కూడా తెలుగుదేశానికి అనుకూలంగా ఓటేయడం పల్లా గెలుపునకు దోహదపడ్డాయి.



విజయదరహాసంతో పల్లా శ్రీనివాసరావు

# పశ్చిమంలో గణబాబు హ్యాట్రిక్



గణబాబుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు మరొక్కసారి తన ఆధిపత్యాన్ని కొనసాగించారు. వరుసగా పశ్చిమ నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ సాధించారు. ఎన్నికల ముందు ఇక్కడ టైట్ ఫైట్ ఉంటుందని అనేకమంది అంచనాలు వేసినప్పటికీ ఆ అంచనాలను తారుమారు చేస్తూ ఘనవిజయాన్ని గణబాబు సాధించారు. గణబాబుకు 90805 ఓట్లు పోల్ కాగా తన సమీప వైసిపి అభ్యర్థి ఆనంద్ కుమార్‌కు 55621 ఓట్లు పోలయ్యాయి. గణబాబు సుమారు 35184 ఓట్లు ఆధిక్యతను సాధించారు. సుమారు మూడు గంటల సమయంలో గణబాబు గెలుపు వెల్లడికావడంతో తెలుగుదేశం శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి.

గణబాబు స్థానికుడిగా ఉంటాడని, సమస్యలపై స్పందిస్తాడని, అభివృద్ధిలో ముందంజలో ఉంటాడని ప్రజల నమ్మారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దీంతో ఆయనకు ప్రజలు 2019లోను కూడా అధికారం ఇచ్చారు. అప్పుడు రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చింది. గణబాబు ఎమ్మెల్యేగా ప్రజలతో ఉండి సమస్యల పరిష్కార దిశగా పయనించారు. రాష్ట్రవ్యాప్తంగా వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిన నేపథ్యం కూడా గణబాబు గెలుపునకు కొంత మేరకు దోహద పడిందని చెప్పవచ్చు. జనసేన, బిజెపి ఓట్లు కూడా తెలుగుదేశం పార్టీకి కలిసి వచ్చాయి. పశ్చిమ నియోజకవర్గంలో సుమారు 12,000 ఓటర్లు ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వలస వచ్చి ఉంటున్నారు. వీరందరూ బిజెపికి ఓటు వేస్తారని అంచనా ఉంది. ఆ ఓట్లు గణబాబుకు బదిలీ అయినట్లు తెలుస్తోంది. ప్రజల్లో గణబాబు పట్ల సానుకూలత, వివాదరహితుడిగా పేరు ఉండటం, రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం ఆయనకు కలిసొచ్చిందని చెప్పొచ్చు

వైసిపి నుంచి పోటీ చేసిన ఆడారి ఆనంద్‌కుమార్ పూర్తిగా ఈ ప్రాంతానికి కొత్త వ్యక్తి. ఎన్నికలకు ముందు 16 నెలల నుంచి ఇక్కడకు వచ్చి రాజకీయం ప్రారంభించారు. ఆర్థిక బలంతో ఆయన సొంత నిధులు వెచ్చించి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. వ్యక్తిగత పింఛన్లు కూడా అందించారు. వైసిపి నుంచి ఆడారి ఆనంద్‌కుమార్ గట్టి పోటీ ఇస్తారని అందరూ అంచనానికి వచ్చారు. ప్రచారంలో కూడా దూసుకుపోయారు. రాష్ట్రంలో వైసిపికి వ్యతిరేక పవనాలు వీయడంతో ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఓటమి తప్పలేదు.

# దక్షిణంలో వంశీకృష్ణ గెలుపు

### మూడింట రెండొంతులు మెజార్టీతో జనసేన గెలుపు

### వైసిపి ఓటమికి పార్టీ లోపల, వెలుపల శక్తులన్నీ ఏకం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కూటమి తరపున జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ గెలిచారనే కంటే, వైసిపి అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ గతంలో ఎన్నడూ లేనంత ఘోరంగా ఓడిపోయారనే చెప్పాలి. టిడిపి తరపున ఎమ్మెల్యేగా గెలిచి, వైసిపిలోకి చేరిన వాసుపల్లికి, అక్కడ పార్టీ లోపల, బయట శక్తులన్నీ ఏకమై ఓడించారు. ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించాలనుకున్న వాసుపల్లి ఆశలకు గండికొట్టారు.

తాజా ఎన్నికల్లో విశాఖ దక్షిణంలో కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ 64,594 ఓట్ల మునుపెన్నడూ లేని భారీ ఆధిక్యతతో గెలుపొందారు. జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు 97,868 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి గణేష్ కుమార్‌కు 33,274 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇండియాఫోరం తరపున కాంగ్రెస్ అభ్యర్థి వాసుపల్లి సంతోష్ కుమార్‌కు 3940 ఓట్లు, మిగిలిన 28 మంది అభ్యర్థులకు 2392 ఓట్లు పోలయ్యాయి. 2019 ఎన్నికలలో 3729 స్వల్పఓట్ల తేడాతో టిడిపి తరపున గెలుపొందిన వాసుపల్లి, తన ప్రత్యర్థి, వైసిపి ఇన్‌ఛార్జి ద్రోణంరాజు శ్రీనివాసరావు అకాలమరణంతో వైసిపి గూటికి చేరారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టి ఎమ్మెల్యేగా పోటీ బరిలో నిలిచారు తాజా ఎన్నికల్లో తప్పక గెలుస్తాడనుకున్న వారిలో ఒకరైన గణేష్‌కుమార్ ఓటమికి చాలా కారణాలే ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తన సామాజిక వర్గానికి చెందిన మత్స్యకారులు ఈ సారి గణేష్‌కు ముఖం చాటేశారని తెలుస్తోంది. ఫిషింగ్ హార్బర్‌లో ఏడాది క్రితం 40 బోట్లు దగ్ధమైన సందర్భంగా ఎమ్మెల్యేగా ఉన్న గణేష్ కంటే, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్పందించిన తీరుపై మత్స్యకారులు ఫిదా అయి, ఆయనకు బాసటగా నిలిచారనే చెప్పాలి, బోట్లు కాలిపోయిన కష్టకాలంలో వారిని స్వయంగా పరామర్శించడంతోపాటు, మత్స్యకారులతో సమావేశమై ప్రమాదంలో బోట్లు కోల్పోయిన వారికి, బోట్లపై పనిచేస్తున్న మత్స్యకారులకు స్వయంగా తన సొంత డబ్బులు సుమారు రూ.కోటి వరకు ఆర్థిక సాయం అందించారు. దీంతో మత్స్యకారులలో జనసేన పట్ల అభిమానం పెరిగింది. ఆ అభిమానమే ఇప్పుడు జనసేన విజయానికి దోహదపడిందని చెప్పవచ్చు.

నియోజకవర్గంలో వైసిపి టికెట్ ఆశించి భంగపడ్డ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ తన అనుచరులతో వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరడం, ఆయనను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా చంద్రబాబు నియమించడం చకచకా జరిగిపోయాయి. దీంతో తన వర్గం వారితో సమిష్టిగాకూటమి విజయానికి ఆయన కృషి చేశారు..ఇందుకోసం పెద్ద ఎత్తున సొంతడబ్బులను కూడా ఖర్చు చేశారు. అంతేకాక ఎమ్మెల్యేగా తమను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరుగురు వైసిపి కార్పొరేటర్లు తిరుగుబాటు చేయడం, వారితోపాటు తనవెంట టిడిపి నుంచి వచ్చిన ఇద్దరు కార్పొరేటర్లు గణేష్‌కు, వైసిపికి బైబైచెప్పడం పెద్ద దెబ్బేనని చెప్పాలి. వీరిలో నలుగురు సీతంరాజు సుధాకర్ వెంట టిడిపిలోకి, ఇద్దరు జనసేనలోకి చేరి, వాసుపల్లికి వ్యతిరేకంగా, కూటమి విజయానికి కృషి చేశారు. నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న ముస్లిమలు గణేష్‌కుమార్ పట్ల వ్యతిరేకభావం రావడంతో, వారంతా బిజెపితో జతకట్టినప్పటికీ, జనసేన అభ్యర్థి వంశీకృష్ణకు సహకరించారు. జరుగుతున్న పరిణామాలన్నీ గుర్తించినప్పటికీ, ఎమ్మెల్యేగా గణేష్‌గానీ, వైసిపి అధిష్టానంగానీ సరిదిద్దే ప్రయత్నం చేయకపోవడం కూటమికి కలిసొచ్చింది. దీంతోపాటు పోలింగ్‌కు ముందు రెండురోజులు ఓటర్లకు డబ్బులు పంపిణీలో వైసిపి వెనుకబాటు కూడా వాసుపల్లి ఓటమికి ఒక కారణంగా విశ్లేషిస్తున్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి పెద్దగా ఏమీ చేయలేని గణేష్‌కుమార్, వైసిపిలో చేరిన తర్వాత కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేసినప్పటికీ, ఓటమి పాలవ్వడం విశేషంగా భావిస్తున్నారు.



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వంశీకృష్ణ

# విజయఢంకా మోగించిన కొణతాల

## అన్ని తరగతులనూ ఏకం చేయడంలో సఫలీకృతం



కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణకు ఎన్నిక పత్రాన్ని ఇస్తున్న ఆర్‌ఓ జాహ్నవి

**ప్రజాశక్తి-అనకాపల్లి**

అనకాపల్లి ఎమ్మెల్యేగా కూటమి తరుపున పోటీ చేసిన జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ వైసిపి అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌పై ఘన విజయం సాధించారు. 65,764 ఓట్లు మెజారిటీతో కొణతాల విజయఢంకా మోగించారు. రాష్ట్రంలోనే జనసేన పార్టీ నుంచి ప్రప్రధమంగా కొణతాల రామకృష్ణను ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అనకాపల్లి ఎమ్మెల్యే కూటమి అభ్యర్థిగా ప్రకటించారు. నాటి నుంచి రామకృష్ణ తనతో రాజకీయ సంబంధాలు నెరపిన ప్రతి ఒక్కరిని ఈ ఎన్నికల్లో తనకు సహకరించాలని అభ్యర్థించారు. వైసీపీకి నియోజకవర్గ గ్రామీణ ప్రాంతంలో గట్టి పట్టు ఉందని భావించి గతంలో ఎన్నడూ శ్రమించిన విధంగా కష్టపడ్డారు. ఆయన కష్టం వృధా కాలేదు. గతంలో అనకాపల్లి నియోజకవర్గంలో నుంచి ఎప్పుడు లేని మెజారిటీని సాధించారు.

2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గుడివాడ అమర్నాథ్, టిడిపి అభ్యర్థి పీలా గోవింద సత్యనారాయణపై 8169 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆ ఎన్నికలో గుడివాడకు 73,207 ఓట్లు రాగా గోవింద సత్యనారాయణకు 65,038 ఓట్లు వచ్చాయి. జనసేన అభ్యర్థి పరుచూరి భాస్కరరావుకు 12,988 ఓట్లు పడ్డాయి. అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి ఐఆర్ గంగాధర్‌కు 1756 ఓట్లు పోలయ్యాయి. 2024 ఎన్నికల్లో మొత్తం 2,13,714 ఓట్లుకుగాను 1,70,582 ఓట్లు (79.8.2 శాతం) పోలయ్యాయి. కొణతాలకు 1,15,126 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి భరత్ కుమార్‌కు 49,362 ఓట్లు పడ్డాయి. గత ఎన్నికల కంటే వైసిపికి 23,845 ఓట్లు తగ్గాయి. ఈవీఎం ఓట్లు కొణతాలకు 1,13,185, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,941 రాగా, వైసిపి అభ్యర్థి భరత్ కుమార్‌కు ఈవీఎం ఓట్లు 48,652, పోస్టల్ బ్యాలెట్లు 710 వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఐఆర్ గంగాధర్‌కు ఈవీఎం ఓట్లు 1,841, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 54 కలిపి 1895 ఓట్లు పోలయ్యాయి. నోటాకు ఓట్లు 1827, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 26 మొత్తం 1853 అంటే 1.07 శాతం వచ్చాయి. కొణతాలకు 66.63 శాతం, భరత్ కుమార్‌కు 28.57 శాతం, గంగాధర్‌కు 1.1 శాతం పోలయ్యాయి.

**భరత్‌కు కలిసిరాని సామాజిక తరగతి, రాజకీయ నేపథ్యం**

అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి వైసిపి తరపున యువకుడైన మలసాల భరత్ కుమార్‌ను నిలబెట్టారు. కసింకోట, అనకాపల్లి మండలాల్లో బలమైన రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్నా, భరత్ కుమార్ గెలుపునకు అది పని చేయలేదు. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న కాపు సామాజిక తరగతి భరత్ కుమార్ గెలుపునకు కషి చేస్తారని వైసిపి భావించినా ఆ దిశగా ఫలితం కనిపించలేదు. భరత్ సొంత మండలంలో సైతం ఆధిక్యత లేకపోవడం గమనార్హం. దీంతో రెండవ రౌండ్‌కే భరత్‌కుమార్ కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లిపోయారు.

**కొణతాలకు కలిసొచ్చిన ఐక్యత**

కొణతాల రామకృష్ణ తన సొంత సామాజిక తరగతితో పాటు మిగిలిన అన్ని సామాజిక తరగతుల వారిని తన గెలుపు కోసం సహకరించాలని అభ్యర్థించారు. దీనికి తోడు టిడిపి శ్రేణులు కొణతాల గెలుపులో కీలకపాత్ర పోషించాయి. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కుటుంబం సహకరించడం ఆయన గెలుపును సునాయాసం చేసింది. వీటన్నింటితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, కూటమికి అనుకూలత కూడా కొణతాల గెలుపునకు దోహదం చేసిందన్నది సుస్పష్టం. ఈ ఎన్నికల ఫలితాల్లో మొదటి రౌండ్ నుంచి కొణతాల తన ఆధిక్యతను ప్రదర్శిస్తూ వచ్చారు. దీంతో టిడిపి జనసేన బిజెపి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పలుచోట్ల చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఫొటోలకు దండలు వేసి సంబరాలు జరుపుకున్నారు.

### ఇదీ కొణతాల రాజకీయ ప్రస్థానం...

కొణతాల రామకృష్ణ 1989లో అనకాపల్లి నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పార్లమెంటు సభ్యునిగా పోటీ చేసి కేవలం తొమ్మిది ఓట్లతో అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుని దేశం దృష్టిని ఆకర్షించారు. తిరిగి 1991లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో 11 వేల పైచిలుకు ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు. 1996లో పోటీ చేసినప్పటికీ ఓటమి పాలయ్యారు. 1999లో అనకాపల్లి శాసనసభకు పోటీ చేసి దాడి వీరభద్రరావు చేతిలో ఓడిపోయారు. 2004లో శాసనసభకు కొణతాల కాంగ్రెస్ నుండి పోటీ చేసిన దాడి వీరభద్రరావుపై 17వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించి వైయస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో మూడు కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. 2009లో ఓటమి చెందారు. రాజశేఖర్‌రెడ్డి మరణం తరువాత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెంట నడిచారు. 2014 ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2014 ఎన్నికల తరువాత వైసిపికి దూరమై ఉత్తరాంధ్ర చర్చ వేదిక ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టారు. 2019లో పోటీకి దూరంగా ఉన్నప్పటికీ 2024 ఎన్నికలకు ముందు జనసేన పార్టీలో చేరి అనూహ్యంగా కూటమి ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దిగి తన రాజకీయ చాతుర్యాన్ని ప్రదర్శించారు. అన్ని వర్గాలను కూడగట్టారు. ఎన్నికలంటే ఎలా చేయాలో చేసి చూపించారు. వ్యాపార కుటుంబంలో పుట్టిన కొణతాల బెల్లం వ్యాపారిగా, సాల్ట్ మర్చంట్‌గా కొద్ది రోజులు గడిపిన తర్వాత రాజకీయ రంగం వైపు ప్రవేశించారు. ఆయనకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. సోదరుడు లక్ష్మీనారాయణ వర్తక సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తుండగా, మరో సోదరుడు రఘునాథ్ మహిళా కళాశాల కరస్పాండెంట్‌గా ఉంటూ నర్సింగ్ కాలేజీని నడుపుతున్నారు. ఇలా ప్రజల జీవితాలతో మమేకమైన రామకృష్ణ కుటుంబం తిరిగి మళ్లీ రాజకీయ తెరపైకి వచ్చింది. ఈ నెల 9న జరిగే మంత్రి వర్గ ప్రమాణ స్వీకారంలో ఆయన కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకుల అంచనా వేస్తున్నారు.

# చోడవరం.. రాజు వశం

## ధర్మశ్రీ కొంపముంచిన పార్టీలో విభేధాలు



విజయ చిహ్నం చూపుతున్న కెఎస్ఎన్ఎస్.రాజు

**ప్రజాశక్తి-చోడవరం**

చోడవరం నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజు 42,189 ఓట్లు మెజార్టీతో ఘనంగా విజయం సాధించారు. వైసిపి అభ్యర్థి కరణం ధర్మశ్రీ రాజు చేతిలో ఘోర పరాజయాన్ని చెవిచూశారు. నియోజకవర్గంలో కరణం ధర్మశ్రీపై మెజార్టీ వైసిపి కార్యకర్తల నుండి ఎన్నికలకు ముందే వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ఆ పార్టీ అధిష్టాన పెద్దల సమక్షంలో నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు నాయకులతో విశాఖ డెయిరీలో సమావేశం ఏర్పాటు చేసి సర్దుబాటు చేసినా ఫలితం లేకపోయింది. ధర్మశ్రీపై వ్యతిరేకత ఉన్న విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణతో పాటు కొంత మంది తీర్థం పుచుకున్నారు. మరికొంత మంది వైసిపిలో ఉంటూనే టిడిపికి సహకరించడంతో ఆ పార్టీకి భారీ మెజార్టీ దక్కిందని చెప్పవచ్చు.

ప్రభుత్వం వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందించడంతో ప్రజా ప్రతినిధులుగా ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధ్యక్షులు, జడ్పిటిసిలు తమకు ప్రాధాన్యత లేదని గత మూడు ఏళ్ల నుండి తమ అసహనం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. నియోజకవర్గ నాలుగు మండలాల్లో వైసీపీకి చెందిన వారే ప్రజా ప్రతినిధులుగా ఉన్నా ఈ ఎన్నికల్లో ఏ ఒక్కరూ పార్టీని భుజానికి ఎత్తుకొని గత ఎన్నికల మాదిరిగా పనిచేసిన దాఖలాలు కనపడలేదు. సంఖ్య రీత్య నియోజకవర్గంలో జనసేన తక్కువగా ఉన్నా పోల్ మేనేజ్మెంట్ చేయడంలో యువకులు అధికంగా ఉండటం వల్ల టిడిపి బాగానే కలిసి వచ్చిందని చెప్పవచ్చు. గత ఎన్నికల్లో జనసేన పార్టీకి 5000 ఓట్లు రాగా, ఈ ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ బాగానే ప్రభావం చూపించింది. నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యేపై ఉన్న అవినీతి ఆరోపణలు ప్రజల్లోకి టిడిపి, జనసేన పార్టీలు బాగానే తీసుకెళ్లాయి. దీనికి తోడు నియోజకవర్గంలో రోడ్లు పూర్తిగా రోడ్లు దెబ్బతినడం, సాగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడం కూడా ప్రభావం చూపింది. వీటన్నింటితోపాటు ఎన్నికల దగ్గర్లో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రైతులను బాగా భయపెట్టడంతో టిడిపికి బాగా కలిసి వచ్చింది.

2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో 2,10,313 ఓట్లు గాను 1,74,724 ఓట్లు పోలయ్యాయి. వీటిలో వైసిపి అభ్యర్థి ధర్మశ్రీకి 94,215 ఓట్లు, టిడిపి అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజుకు 66,578 ఓట్లు, జనసేన అభ్యర్థి పివిఎస్ఎన్.రాజుకు 5,300 ఓట్లు, నోటాకు 536 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో 2,17,488 ఓట్లకు 1,84,026 ఓట్లు పోలయ్యాయి. విజయం సాధించిన టిడిపి అభ్యర్థి రాజుకు 1,09,651 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి ధర్మశ్రీకి 67,462 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి జగతా శ్రీనివాసరావుకు 2527 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థి వేగి మహాలక్ష్మినాయుడుకు 1179, ఓట్లు, సిపిఐఎంఎల్ లేబరేషన్ అభ్యర్థి సవరాల గణేష్‌కు 676 ఓట్లు, ఇండిపెండెంట్ పి.వివేక్‌రాజుకు 397, నోటాకు 3849 ఓట్లు వచ్చాయి. కౌంటింగ్ మొదలైన దగ్గర నుండి శివాలయంలో ఉన్న టిడిపి అభ్యర్థి రాజు వద్దకు నియోజకవర్గానికి చెందిన టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు పెద్ద స్థాయిలో రావడం మొదలుపెట్టారు. గెలుపు అనంతరం రాజుకు అభినందనలు తెలిపారు.


కొణతాలకు నూకాంబి అమ్మవారి చిత్ర పటం ఇస్తున్న జైవీర్, సురేంద్ర

## నూకాంబిక అమ్మవారికి కొణతాల ప్రత్యేక పూజలు

**ప్రజాశక్తి-అనకాపల్లి**

టిడిపి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొణతాల రామకృష్ణ అనకాపల్లి శ్రీనూకాంబిక అమ్మవారిని మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కూటమి అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల రామకృష్ణ అల్లుడు భీమరశెట్టి రాంకీ, టిడిపి నాయకులు దాడి జైవీర్, మళ్ళ సురేంద్ర, మళ్ళ రాజా తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వస్తున్నందుకు నూకాంబిక అమ్మవారి పాదాల దగ్గర 116 కొబ్బరికాయలు కొట్టి ముక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పొలమరశెట్టి సత్యనారాయణ, కొణతాల మాధవ్, మల్ల సంతోష్, రాజు, ఎస్.భానుచందర్ (అఖి), జొన్నాడ సురేష్ నంద్యాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇది ప్రజా విజయం

**ప్రజాశక్తి-అనకాపల్లి**

జగన్ రెడ్డి అరాచక పాలన నుండి విముక్తి కల్పించి ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రజా తీర్పు ఇచ్చారని, ఇది ప్రజా విజయమని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు పేర్కొన్నారు. టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో మంగళవారం కూటమి విజయోత్సవ వేడుకల్లో కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఇచ్చిన అధికారాన్ని జగన్ తన సొంత ప్రయోజనాల కోసం వాడుకున్నారని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేసి, ఇష్టం వచ్చినట్లు జీవోలు ఇచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన విషయాన్ని ప్రజలు గమనించారన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు నూటికి నూరు శాతం ప్రజలు నమ్మారు కాబట్టే కూటమికి ఓట్లు వేశారని పేర్కొన్నారు. ఇప్పుడు చంద్రబాబుపై గురుతరమైన బాధ్యత ఉందని, ఇచ్చిన హామీలు నెరవేర్చుకుంటూ, కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర అభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన, రాజధాని నిర్మాణం, అమరావతి రైతులకు న్యాయం, పోలవరం, సుజల స్రవంతి, వెనుకబడి ప్రాంతాల అభివృద్ధికి పాటుపడవలసి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, డాక్టర్ నారాయణరావు, లాలం కాశీనాయుడు వినోద్ రాజు, కోట్ని రామకృష్ణ, కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ మురళి, జంపా మల్లికార్జునరావు, విల్లూరి రమణబాబు, సబ్బవరపు గణేష్, దూలం ప్రసాదు, గుర్రం నూకరాజు, శ్రీనివాసరావు, కోట్ని రాంబాబు, కుప్పిలి జగన్, సాలపు నాయుడు, బొబ్బిలి నరసింహారావు, సూరిశెట్టి బల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న టిడిపి శ్రేణులు

# జనసేనకు పట్టం కట్టిన యలమంచిలి ఓటర్లు

## వైసిపి అభ్యర్థి కన్నబాబురాజు ఘోర పరాజయం

**ప్రజాశక్తి - యలమంచిలి**

నరాలు తెగే ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎలాగైతే 'వార్ ఒన్ సైడ్ అయిందో యలమించిలి నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి. ఈ నియోజకవర్గం ఓటర్లు కూటమి తరుపున పోటీ చేసిన జనసేన పార్టీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌కు పట్టం కట్టారు. యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న యలమంచిలి, రాంబిలి, అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో మొత్తం 2,06,394 మంది ఓట్లు ఉండగా, 1,77,376 ఓట్లు పోలయ్యాయి. జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌కు 1,09,443 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి యువి.రమణమూర్తిరాజుకు 60,487 ఓట్లు వచ్చాయి. 48,956 ఓట్లు మెజార్టీతో విజయ్‌కుమార్ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి టి.అనంతరామ నర్సింగరావుకు 1822 ఓట్లు వచ్చాయి. అదే 2019లో ఎమ్మెల్యేగా నెగ్గిన వైసిపి అభ్యర్థి యువి.రమణమూర్తిరాజుకు 71,934 ఓట్లు రాగా, నాడు టిడిపి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుకు 67,788 ఓట్లు, జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు 19,774 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో టిడిపి, జనసేన కలిసి పోటీ చేయడంతో జనసేన విజయం సునాయాసమైంది. మంగళవారం ఉదయం పది గంటల సమయానికే టిడిపి కూటమి విజయావకాశాలకు చేరువవుతోందని, యలమంచిలి నియోజకవర్గం జనసేన కైవసం అయిందన్న సంకేతాలు వెలువడ్డంతో విజయకుమార్ అభిమానులు రోడ్ల మీదకొచ్చి యలమంచిలిలో పలు చోట్ల బాణసంచా కాల్చారు. కేరింతలతో స్వీట్లు పంచుకున్నారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద విజయ్‌కుమార్, పార్టీ నాయకులు

**మొదటి నుంచి ప్రజల్లో ఉన్న సుందరపు విజయకుమార్**

యలమంచిలి నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన సుందరపు విజయ్‌కుమార్ గత పదిహేనేళ్లుగా స్థానిక రాజకీయాల్లో ఉన్నారు. ప్రజల సమస్యలపై జరిగిన పోరాటాల్లో పాల్గొన్నారు. ప్రధానంగా ఎస్ఇజెడ్ నిర్వాసితులు, రోడ్లు, రైతు సమస్యలు, అక్రమ మద్యం అమ్మకాలు అరికట్టాలని చేసిన ఉద్యమాల్లో ప్రధాన పాత్ర పోషించారు. నాలుగు మండలాల్లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులకు అర్థిక సహాయం చేసి విజయతీరాలకు చేర్చారు. ఆ విశ్వాసం చాలా గ్రామాల్లో ప్రస్ఫుటించింది. కలుపుగోలుగా మాట్లాడటం, ఆప్యాయంగా పలకరించడం ఆయన్ను ప్రజలకు సన్నిహితం చేసింది. నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు తన 'కాపు' సామాజిక తరగతికి చెందిన వారు కావడం మరో కలిసొచ్చిన అంశం. 2019 ఎన్నికల్లో వైసిపి, టిడిపి మధ్య జరిగిన గట్టి పోటీలో జనసేన తరపున పోటీ చేసిన సుందరపు విజయ్‌కుమార్ సుమారు 19వేల ఓట్లు సాధించి టిడిపి ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఓటమికి పరోక్షంగా కారకులయ్యారు. క్రమంగా నియోజకవర్గంలో వైసిపిని ఎదుర్కొనే గట్టి నాయకుడిగా విజయకుమార్ ఎదిగారు. 2024 ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా టికెట్ సాధించి మరో మెట్టు ఎదిగారు. తెలుగుదేశం సీటు ఆశించిన ప్రగడ నాగేశ్వరరావుకు అవకాశం రాకపోవడంతో ఎన్నికల తొలి రోజుల్లో మనస్పర్థలు ఏర్పడ్డాయి. సీనియర్ నాయకుడు పప్పల చలపతిరావు ఇద్దరికీ రాజీ కుదిర్చి ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయడంతో విజయావకాశాలు మెరుగయ్యాయి. టిడిపి, జనసేన, బిజెపి ఓట్లు బదిలీ పూర్తిస్థాయిలో జరిగిందన్నది స్పష్టం కనిపిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి వైపు ఉన్న అనుకూలత కూడా విజయ్‌కుమార్ గెలుపునకు దోహదం చేసింది.

**కన్నబాబురాజు స్వయంకృతాపరాధం**

వైసిపి అభ్యర్థి యువి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) నోటి దురద మూలంగా శత్రువుల్ని కొని తెచ్చుకున్నారు. అవసరం లేకపోయినా నోరు పారేసుకోవడం, నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తల మీదే సుమారు 164 పోలీసు కేసులు పెట్టించారన్న అపవాదు ఉంది. దీంతో కన్నబాబురాజు ఓటమికి





విజయ చిహ్నం చూపుతున్న సుందరపు విజయ్‌కుమార్

సొంత పార్టీ వారే పనిచేశారన్న విమర్శలున్నాయి. ఓటర్లకు పంచాల్సిన సొమ్ము సొంతమనుషులే వెనకేసుకున్నారని గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. ఆస్తులు కూడేయడంలో చూపిన శ్రద్ధ పార్టీ శ్రేణుల్ని నడిపించడంలో చూపలేదన్న విమర్శలున్నాయి.

### రాజకీయ చరిత్రలో గొప్ప గుణపాఠం

కలలో కూడా ఊహించని ఫలితాలివి. బొటాబొటిగా నెగ్గి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందనుకున్నాం. అయితే వైఎస్ఆర్‌సిపి కుప్పకూలిన విధానం మాత్రం రాజకీయ చరిత్రలో గొప్ప గుణపాఠంగా నిలిచిపోతుంది. ప్రజాస్వామ్యంలో తలబిరుసు, అహంకారం ఎంతటి వాడినైనా మట్టికరిపిస్తుందన్న సత్యం తేటతెల్లమైంది. ప్రజలు అదును చూసి వాతపెట్టారు. అభివృద్ధి కోరుకున్న వారిని అందలం ఎక్కించారు. బటన్ నొక్కుడు సొమ్ముకోసం ఆశపడకుండా అభివృద్ధి వైపు మొగ్గుచూపారని రాష్ట్ర ప్రజలు రుజువు చేశారు.

**- పప్పల చలపతిరావు, మాజీ ఎంపీ, టిడిపి సీనియర్ నాయకులు**



హరిపాలెంలో కేక్ కట్ చేస్తున్న టిడిపి కార్యకర్తలు

## కూటమి విజయంపై సంబరాలు

**ప్రజాశక్తి-అచ్యుతాపురం**

ఎలమంచిలి ఎమ్మెల్యేగా సుందరపు విజయ్‌కుమార్, అనకాపల్లి ఎంపీగా సీఎం రమేష్ విజయం సాధించడంతో అచ్చుతాపురం మండలంలో టిడిపి, జనసేన పార్టీల కార్యకర్తలు అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కేకులు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. తిమ్మరాజుపేట గ్రామంలో వంద మందికి పైగా బైకులతో ర్యాలీ చేశారు. కొండకర్ల ఆవలో దోనెలపై విహారం చేస్తూ కేకులు కట్‌చేసి ఆనంద వేడుకలు జరుపుకున్నారు.

## కూటమి శ్రేణుల విజయోత్సవాలు

**ప్రజాశక్తి- వడ్డాది**

రాష్ట్రంలో తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమి అభ్యర్థులు గెలుపు పొందడంతో గ్రామాల్లో ఆ పార్టీల శ్రేణులు కేరింతలతో అలజడి చేశారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది, బంగారు మెట్ట, ఎల్వి అగ్రహారం, పొట్టి దొరపాలెం, ఎల్ సింగవరం, కోమలపూడి తదితర గ్రామాల్లో జనసేన, టిడిపి కార్యకర్తలు కేకులు కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. గ్రామాల్లో యువత బాణసంచా కాల్చి సందడే చేశారు. ఈ సందర్భంగా ఎల్బీపీ అగ్రహారం మాజీ సర్పంచ్ తమరాన దాసు, సాయం శేషు మాట్లాడుతూ ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వంతో చూసిన ప్రజలు జగన్మోహన్ రెడ్డికి ఓటు రూపంలో తగిన బుద్ధి చెప్పారని అన్నారు

**బుచ్చయ్యపేట :** సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో సంబరాలు చేసుకున్నారు. పలు గ్రామాల్లో కేకులు కట్ చేసుకుని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఫుల్ జోష్

**దేవరాపల్లి :** రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి తిరిగి లేని విజయం సాధించడంతో కూటమి శ్రేణుల్లో జోష్ పెరిగింది. మండల కేంద్రం దేవరాపల్లిలో మాజీ ఎంపీపీ, టిడిపి నాయకులు కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కూటమి ఊహించిన దానికంటే ఫలితాలు రావడంతో పార్టీ శ్రేణులు తండోపతండాలుగా కిలపర్తి భాస్కరరావు నివాసానికి చేరుకున్నారు. గెలుపొందిన కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి చిత్రపటాలతో తయారు చేసిన భారీ కేకును కట్ చేశారు. అనంతరం స్థానిక అంబేద్కర్ కాలనీలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి కిలపర్తి భాస్కరరావు పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి భారీ విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, గుల్లిపల్లి మురళి, బంధం అప్పలరాజు, సబ్బవరపు మాలిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎంపిపి భాస్కరరావుకు కేక్ తినిపిస్తున్న టిడిపి కార్యకర్తలు

# విస్తృత బందోబస్తు

### పర్యవేక్షించిన ఎస్‌పి మురళీకృష్ణ



ప్రత్యేక దళాలతో బందోబస్తు నిర్వహిస్తున్న దృశ్యం



కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లేవారిని తనిఖీ చేస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి- అనకాపల్లి :** ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా మంగళ, బుధవారాల్లో జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ ఆదేశాల మేరకు జిల్లాలో పోలీస్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ కఠినంగా అమలు పరుస్తున్నారు. పికెట్లు ఏర్పాటు చేసి, ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఎక్కడ ప్రజలు గుమి కూడకుండా చర్యలు తీసుకుంటున్నారు. విశాఖపట్నం గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ ఆర్‌కె.మీనా, జనరల్ అబ్జర్వర్ రాకేష్ కుమార్, అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్లతో కలిసి శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

# పొట్టి శ్రీరాములుకు నివాళి

**ప్రజాశక్తి -అనకాపల్లి**

నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా నామకరణం చేసి 16 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో పొట్టి శ్రీరాములు భవన్ నిర్మాణ నిర్వాహకులు పి.మూర్తి ఆధ్వర్యంలో మెయిన్ రోడ్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుని పివిఎం నాగజ్యోతి నెల్లూరు జిల్లా విశేషాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త కర్రి సన్యాసినాయుడు, హెచ్డిఎఫ్సి బ్యాంక్ మేనేజర్ జనార్దన్, ఐసిఐసిఐ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, గంగుపాము నాగేశ్వరరావు, సోమేశ్వరరావు (రిటైర్డ్ టీచర్) సీతారామయ్య, చంటబ్బాయి పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

# ఫలించిన కూటమి సమిష్టి కృషి

## -పదేళ్ల తర్వాత మాడుగుల కోటపై టిడిపి జెండా
## -ఎమ్మెల్యేగా బండారు ఘన విజయం



ప్రజాశక్తి - మాడుగుల: రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌డిఎ కూటమి సునామీలో వైసిపి కొట్టుకుపోయింది. అదే పవనాలు మాడుగులలో చూపినప్పటికీ, ఇక్కడ టిడిపి, జనసేన, బిజెపి కూటమి పార్టీల నేతలు, కేడర్ మధ్య సమన్వయం, సమిష్టి కృషితో పదేళ్ల తర్వాత మాడుగుల కోటపై టిడిపి జెండా రెపరెపలాడింది. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా టిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఘనవిజయం సాధించాడు. కూటమి అభ్యర్థి ఎవరనేది చివరివరకు అనిశ్చితి నెలకొనడంతోపాటు, ముందుగా ప్రకటించిన పైలా ప్రసాదరావును మార్పుచేసి తీవ్ర కసరత్తు అనంతరం మాజీ మంత్రి టిడిపి సీనియర్ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తిని పోటీ బరిలోకి దింపేంత వరకు గందరగోళం నెలకొంది. అంతేకాక కూటమి అభ్యర్థి నాన్‌లోకల్ అంటూ వైసిపి గట్టిగానే ప్రచారం చేసినప్పటికీ, దాన్ని తిప్పికొట్టడంతో కూటమి శ్రేణులు విజయవంతమయ్యాయనే చెప్పాలి. తెలుగుదేశం తరపున ఆశావహులుగా నున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానయుడు, సీనియర్ నేత పైలా ప్రసాదరావు, నూతనంగా తెలుగుదేశంలో చేరిన మాడుగుల నియోజకవర్గంలో బలమైన నేత కిలపర్తి భాస్కరరావు, జనసేన సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ, బిజెపి ఎంపి అభ్యర్థి సిఎం రమేష్ వర్గీయులు ఇలా మూడుపార్టీలకు చెందిన నేతలంతా ఏకతాటిపైకి వచ్చి బండారు విజయంలో కీలకపాత్ర పోషించారు. మాడుగుల ఎమ్మెల్యేగా కూటమి అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి తన ప్రత్యర్థి వైసిపికి చెందిన ఈర్లే అనురాధపై 28 వేల 26 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మాడుగుల నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తికి 91, 869 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి ఈర్లే అనురాధకు 63,843 ఓట్లు పోలయ్యాయి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డు శ్రీనివాస్‌కు 1784 ఓట్లు, నోటాకు 4070 ఓట్లు వచ్చాయి.

ఇక 2019 ఎన్నికల్లో వైసిపి తరపున గెలిచిన బూడి ముత్యాలనాయుడుకు అప్పట్లో 78,830 ఓట్లు రాగా, టిడిపి అభ్యర్థి గవిరెడ్డి రామానాయుడుకు 62,438 ఓట్లు రావడంతో, 16,392 ఓట్లు తేడాతో అప్పటి వైసిపి హవాలో బూడి విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికలలో ఆయన కుమార్తె ఈర్లె అనురాధ వైసిపి అభ్యర్థిగా బరిలో దింపగా, ఓటమి పాలైంది. ఏడుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసిన అనుభవం, మాజీమంత్రిగా, సీనియర్ నేతగా ఉన్న ప్రభావం, ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడం వంటివి బండారును విజయతీరాలకు చేర్చాయని చెప్పొచ్చు.అంతేకాక అనకాపల్లి ఎంపీ స్థానంలో కూటమి అభ్యర్థిగా సిఎం రమేష్ బరిలోకి దిగాక, ఆ పార్టీకి అన్నివిధాలా ఊపు వచ్చిందనే చెప్పాలి.

**స్వయంకృత్యమే వైసిపి ఓటమికి కారణమా?**

ఇక వైసిపి ఓటమికి విశ్లేషిస్తే స్వయంకృత్యమే కారణమని భావిస్తున్నారు. వరుసగా రెండుసార్లు విజయం సాధించడంతోపాటు పట్టున్న నేత బూడి ముత్యాలనాయుడును కాదని, అతని కుమార్తె, రాజకీయంగా అంతగా అనుభవంలేని ఈర్లె అనురాధను వైసిపి పోటీకి దింపడం వైసిపి ఒకటికి ప్రధాన కారణమని భావిస్తున్నారు. హ్యాట్రిక్ సాధిస్తాడనుకున్న బూడిని కాదనడంతో కేడర్ నిరుత్సాహానికి గురైంది. మరోవైపు కిలపర్తి భాస్కరరావుకు వంటి సమర్ధుడైన నాయకుడిని నిర్లక్ష్యం చేయడంతో ఆయన వైసిపిని వీడి టిడిపిలో చేరడం గట్టిదెబ్బగా చెప్పొచ్చు. దీంతో కొడుకు బూడి రవితో తరచూ గొడవలు కూడా కుటుంబ కలహాలు ప్రజల్లో బూడిని పలచన చేసి ప్రభావం చూపాయని భావిస్తున్నారు. పోనీ సామాజికవర్గం సహకారం ఉంటుందనుకుంటే, టిడిపి సైతం అదే సామాజికవర్గానికి చెందిన బండారును బరిలో నిలపడంతో ఓటమి పరిపూర్ణమైందని భావిస్తున్నారు. మాడుగుల అసెంబ్లీలో విజయం సాధించిన బండారు సత్యనారాయణమూర్తి మాడుగుల కార్యకర్తలను కలిశారు. తన విజయానికి కారకులైన కార్యకర్తలు అభిమానులను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మాడుగుల మోదకొండమ్మను దర్శించుకున్నారు.



విజయ చిహ్నం చూపుతున్న బండారు

## మురుగు నీటి కాలువ పనుల్లో...
# నాణ్యతా ప్రమాణాలు ఏవీ?



నిర్మాణ దశలో ఉన్న కాలువ

ప్రజాశక్తి- కొత్తకోట:రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామంలో నిర్మాణం చేపట్టిన మురుగు నీటి కాలువ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు విలేకర్లకు పలు విషయాలు వెల్లడించారు. పంచాయతీ నిధుల నుంచి స్థానిక తవ్వా సత్యనారాయణమూర్తి ఇంటి నుంచి 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్ సమీపంగా శ్మశాన వాటిక వరకు నిర్మాణం చేపడుతున్న కాలువ పనుల్లో మట్టితో కలిసిన ఇసుకతో పాటు సిమ్మెంటు, ఇతర సామాగ్రిలో నాణ్యత కొరవడిందని గ్రామస్తులు ఆరోపించారు. పనులు చేపట్టిన సమయంలో పంచాయితీ అధికారులు, సచివాలయ సైట్ ఇంజనీర్, సహాయ ఇంజనీర్ వంటి సిబ్బంది లేకుండానే మేడవాడికు చెందిన ఓ కాంట్రాక్టర్ పనులు పూర్తి చేస్తుండటంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో మురుగునీటి కాలువ లేక స్థానికులు ఇబ్బందులు గురయ్యారు. కాలువ నిర్మాణం చేపట్టారన్న ఆనందం స్థానికులలో కనిపించలేదు. అర్జాపురానికి చెందిన ఓ రాజకీయ ప్రముఖుని బంధువు కావడంతో కాంట్రాక్టర్ పనులలో నాణ్యత పాటించలేదనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. గ్రామస్తులు ఎవరైనా పనుల నాణ్యత పై ప్రశ్నిస్తే వారిని బెదిరించే ధోరణి లో మాట్లాడుతున్నారని స్థానికులు విలేకరుల వద్ద వాపోయారు.

ఈ నిర్మాణ పనులపై జెఈ సుజాతను వివరణ కోరగా పంచాయతీరాజ్‌కు సంబంధించిన పనులైనప్పటికీ తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, తనకు తెలిసిన సమాచారం మేరకు సచివాలయ సైట్ సహాయ ఇంజనీర్‌ను పనులు పరిశీలనకు పంపినట్టు తెలిపారు. పనులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాల్సిన సచివాలయ సైట్ ఇంజనీర్ సెలవులో ఉన్నట్టు సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు.




నిర్మాణ పనులకు వినియోగిస్తున్న నాశిరకమైన ఇసుక



నక్కపల్లిలో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

## విద్యార్థులకు బహుముఖ పోటీలు

### -ఉత్సాహంగా వేసవి శిబిరాలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఖో ఖో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విజేతలకు వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

**చీడికాడ:**వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు, విద్యార్థులకు ఇంగ్లీష్ పదాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్యారమ్స్ ఆటలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి జోగేశ్వరి తెలిపారు. విద్యార్థులు ఎండలో వడదెబ్బకు గురికాకుండా ఈ వేసవి విజ్ఞాన శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యతను వెలికి తీసేందుకు, ఆటల్లో ప్రావీణ్యతను పెంపొందించుటకు ఈ విజ్ఞాన శిబిరం తోడ్పడుతుందన్నారు.



చీడికాడలో ఆంగ్లంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

## విజ్ఞానం..వినోదభరితం..

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించడానికి వేసవి విజ్ఞాన శిబిరాలు మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ శిబిరాలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులకు నిర్వహిస్తున్నారు. సెలవులు కావడంతో విద్యార్థులు ఉదయం 9 గంటల నుంచే గ్రంథాలయానికి చేరుకొని ఉత్సాహంగా పాల్గొం టున్నారు. విద్యార్థులకు పలు రకాల పుస్తకాలపై అవగాహన కల్పించడంతో పాటు కథల పోటీలు, వ్యాసరచన, క్విజ్, రన్నింగ్, డాన్స్, ఖో ఖో ఆటలతో పాటు పలు ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. రోజు వారీగా ఒక్కొక్క ఆటల పోటీలను నిర్వహిస్తుండటంతో విద్యార్థులు, చిన్నారులు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొంటున్న పలువురు అధికారులు, రాజకీయ నాయకులు గ్రంథాలయాల ద్వారా కలిగే విజ్ఞానంపై విద్యార్థులకు పలు రకాలుగా అవగాహన కల్పిస్తున్నారు. వేసవి సెలవుల్లో విజ్ఞాన శిబిరాలను నిర్వహించి విజ్ఞానం, ఆటల పోటీలు ఏర్పాటు చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా గ్రంథాలయాల్లో పోటీలను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు



శిథిలమైన వంతెన

## శిథిలావస్థలో వంతెన

### -భారీ వాహనాలు రాకపోకలు

### -ఆందోళనలో వాహనదారులు

**ప్రజాశక్తి-కోటవురట్ల:**మండలంలోని జల్లూరు వరహా నదిపై నిర్మించిన వంతెన అసంపూర్తిగా వదిలివేయడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో, ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు, ప్రధానంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 2016లో ప్రారంభించిన వంతెన దాదాపుగా 2019లోనే పూర్తయింది.అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టక పోవడంతో పాత వంతెన పైనుంచి ప్రయాణాలు సాగిస్తున్నారు. గత ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నేటికీ వంతెన పై దృష్టి సారించక పోవడంతో నాటి నుంచి వంతెన అలానే ఉండిపోయింది. వంతెన పూర్తి కాకపోవడంపై నర్సీపట్నం డివిజన్ పరిధిలోని ప్రజలు డివిజన్ కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.ఏ క్షణాన పాత వంతెన కూలి పోతుందోనని ప్రధానంగా రాత్రి సమయంలో వంతెన పైనున్న గోతుల కారణంగా ప్రమాదాల సైతం సంభవిస్తున్నాయి. అధికారులకు పలుమార్లు మండలం నుంచి పలువురు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరుత్తినట్లు వ్యవహరిస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

డివిజన కేంద్రంలో విద్యా సంస్థలకు విద్యార్థులు నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. దీనికి తోడు పాత వంతెన పైనుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గతంలో భారీ వాహనాలు నిషేధం అంటూ బోర్డులు పెట్టిన అధికారులు ఇప్పుడు పట్టించుకోవడం మానేశారు. రానున్న వర్షాకాలం సీజన్లోనైనా మంతెన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.




శిథిలమైన వంతెనపై వెళుతున్న వాహనాలు

### అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్సకు ఓట్లేసిన ప్రజలకు ధన్యవాదాలు : సిపిఎం

**ప్రజాశక్తి-పాడేరు:** 2024 సార్వత్రిక ఎన్నికల్లో సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సకు అత్యధిక ఓట్లు వేసి ఆదరించిన ప్రజలకు, ప్రత్యక్షంగా, పరోక్షంగా తమను ప్రోత్సహించిన శ్రేయోభిలా షులందరికీ సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలియ చేసింది. పాలక, ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ప్రలోభాలు పెట్టి, గిరిజన తెగల మధ్య వైషమ్యాలు సృష్టించినా, కోట్లాది రూపాయలు పంపిణీ చేసి ప్రలోభాలు పెట్టినా.. వాటిన్నింటినీ త్రోసి పుచ్చి నిజాయితీతో గిరిజనుల పక్షాన పోరాటం చేసిన అభ్యర్థికి అత్యంత విశ్వాసంతో ఓట్లేసారని తెలిపింది. ఏ నమ్మకంతో ఓట్లు వేసి విశ్వాసం చూపించారో అదే విధంగా గిరిజన సమస్యల పట్ల నిరంతరం పోరాటాలు ప్రజల తరపున నిర్వహిస్తామని పేర్కొంది. ప్రధానంగా 1/70 చట్టం, జి.ఓ 3 పునరుద్ధరణ, స్పెషల్ డిఎస్సీ, రైతులకు గిట్టుబాటుధర, మాతృభాషా విద్యావాలంటీర్లు, స్కీం వర్కర్లు, కార్మికుల భద్రత, ఉద్యోగ, ఉపాధ్యాయ, మహిళలు, పివిటిజిల అభివృద్ధి, గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేసి, ప్రజా పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కమిటీ వెల్లడించింది.

# పేటలో అనిత విజయం

**ప్రజాశక్తి-నక్కపల్లి:**పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత ఘన విజయం సాధించారు. ప్రత్యర్థి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులపై అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. పాయకరావుపేట నియోజకవర్గం లో మునుపెన్నడూ లేని విధంగా 43727 ఓట్లతో భారీ మెజార్టీ సాధించారు. వంగలపూడి అనితకు 120042 ఓట్లు రాగా ,వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు కు 76315 వచ్చాయి. 43727 ఓట్ల మెజారిటీతో అనిత విజయం సాధించారు.



2019 లో జరిగిన ఎన్నికల్లో వైసిపి తరుపున పోటీ చేసిన గొల్ల బాబురావు 31189 ఓట్లు భారీ మెజార్టీతో గెలుపొందగా, ఇప్పుడు అనిత ఆ రికార్డును బద్దలు కొట్టారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన బోని తాతారావుకు 2087 ఓట్లు వచ్చాయి.

పాయకరావుపేట నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కంబాల జోగులు నియోజక వర్గానికి కొత్త ముఖం. ఎన్నికలకు కొద్ది రోజులు ముందు మాత్రమే ఆయన నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు పరిచయం అయ్యారు.జోగులు కొత్త ముఖం అయినప్పటికీ జగన్ చరిష్మా, వైసిపి పథకాలు ఆయన్ను గెలిపిస్తాయని పార్టీ శ్రేణులు పెట్టుకున్న ఆశలు ఆడి ఆశలు అయ్యాయి .

2014లో అనిత తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి చెంగల వెంకట్రావుపై 2828 ఓట్లతో అతి స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. ఆమె గెలుపొందిన తర్వాత నియోజకవర్గంలో ఆమెపై అసమ్మతి రావడంతో, అధిష్టానం కొవ్వూరుకు పంపించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో డాక్టర్ బి.బంగారయ్యను బరిలో దింపిన ప్పటికీ వైసీపీ అభ్యర్థి గొల్ల బాబురావు 31189 భారీ ఓట్ల మెజారిటీతో బంగారయ్య పై గెలుపొందారు.

2019 ఎన్నికల తర్వాత అధిష్టానం వంగలపూడి అనితకు తిరిగి పాయకరావుపేట నియోజకవర్గం బాధ్యతలు అప్పగించడంతో అప్పటి నుంచి నేటి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ అందరికీ అందుబాటులో ఉన్నారు. ఎన్నికల ముందు అసమ్మతి నాయకులను కలుపుకుని ప్రచారంలో ముందుకు సాగారు. అన్ని వర్గాల ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి, వారితో మమేకమయ్యారు. గతంలో ఆమె ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గ్రామాల్లో చేసిన అభివృద్ధి ,కూటమి మ్యానిఫెస్టో ను ఎన్నికల ప్రచారంలో గ్రామాల్లో ప్రచారం చేపట్టారు.ముఖ్యంగా ప్రత్యర్థి అభ్యర్థి కంబాల జోగులు నియోజకవర్గ ప్రజలకు కొత్త ముఖం కావడం అనితకు కలిసొచ్చాయి .

ఎమ్మెల్యేగా ఉన్న గొల్ల బాబురావు పై అసమ్మతి ఉండటంతో వైసిపి అధిష్టానం రాజం ఎమ్మెల్యే కంబాల జోగులు పేరును తెరపైకి తెచ్చి ఎమ్మెల్యే అభ్యర్థిగా సీటు కేటాయించింది. ఎన్నికలు సమీపిస్తున్న కొన్ని నెలల ముందు మాత్రమే ఆయన్ను రంగంలోకి దింపింది. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు ,ప్రజలకు ఆయన కొత్త కావడంతో ఆశించినంతగా ఆయన మమేకం కాలేకపోయారు. ఆయన గెలుపునకు పార్టీ కేడర్ కష్టించి పనిచేసినా ఫలితం లేకుండా పోయింది.

**బరిలో నిలిచింది వీరే ..**

పాయకరావుపేట నియోజకవర్గం అసెంబ్లీ స్థానానికి గాను 9 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. వీరిలో వంగలపూడి అనిత (తెలుగుదేశం), కాకర నరసింహారావు (బహుజన సమాజ్ పార్టీ),కంబాల జోగులు (వైసిపి), బోని తాతారావు ( కాంగ్రెస్ ), కృష్ణ స్వరూప్ వడ్లమూరి (దళిత బహుజన పార్టీ), దూలపల్లి నాగేశ్వరరావు (జై భారత్ నేషనల్ పార్టీ), పరవాడ రామకష్ణ (ప్రబుద్ధ రిపబ్లిక్ పార్టీ ), భూర్తి ఏసయ్య ( స్వతంత్ర అభ్యర్థి), శెట్టిబత్తుల ధర్మరాజు (స్వతంత్ర అభ్యర్థి )లుగా పోటీ చేశారు .



అనితను సన్మానిస్తున్న నాయకులు

పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్ రాయవరం, కోటవురట్ల మండలాల్లో 250744 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 123363, మహిళలు 127379, ఇతరులు 2 మంది ఉన్నారు. మే 13న జరిగిన ఎన్నికల్లో పురుషులు 102411, మహిళలు 104214, ఇతరులు 1 మొత్తం 206626 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతం కన్నా పోలింగ్ శాతం అత్యధికంగా నమోదయింది.

**వెంకన్నను దర్శించుకున్న అనిత**

**ప్రజాశక్తి- నక్కపల్లి:**ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్నను పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన వంగలపూడి అనిత మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆమె పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలను అందజేశారు. నాయకులు తోట నగేష్, కొప్పిశెట్టి కొండబాబు, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై అనితకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నర్సీపట్నంలో అయ్యన్న గెలుపు

**ప్రజాశక్తి-నర్సీపట్నం:**నర్సీపట్నం అసెంబ్లీ నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు విజయం సాధించారు. ఏడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు మొత్తం 19 రౌండ్‌లలో జరిగింది. రెండు రౌండ్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించారు. 19 రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి టిడిపి అభ్యర్థి అయ్యన్నపాత్రుడు, తన సమీప వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పెట్లఉమాశంకర్ గణేష్ పై 24676 ఓట్ల తో విజయం సాధించారు. నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అయ్యన్న కాలనీలో తలుపులమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అయ్యన్న ఇంటికి అభిమానులు వెల్లువెత్తారు.



నర్సీపట్నంలో ఐదు సంవత్సరాల క్రితం నిర్మాణాలు చేపట్టిన టిడ్కో ఇళ్ల పంపిణీ చేయక పోవడం, పట్టణ అభివృద్ధి పై పూర్తిగా దృష్టి పెట్టకపోవడం, నందమూరి తారక రామారావు ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలపై కనీసం పట్టించుకోకపోవడం వైసిపి ఓటమికి కారణమని స్థానికులు అంటు న్నారు. అభి వృద్ధిపై దృష్టి పెట్టకపోవడంతోనే వైసీపీ పార్టీకి తీవ్ర నష్టం చేకూరిందన్నారు. ఏజెన్సీ ముఖ ద్వారమైన నర్సీపట్నం పరిసర ప్రాంత ప్రజలకు సరైన సౌకర్యాలు కల్పించి పట్టణ అభివృద్ధి పై దృష్టి పెడితే బాగుండేదని నియోజకవర్గ ప్రజలు తెలిపారు.పట్టణ ప్రజలకు ప్రధాన సమస్య రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సమస్యపై ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ దృష్టి పెట్టినప్పటికీ పూర్తిస్థాయిలో విస్తరణ చేపట్టకపోవడం కొంత ఓటమికి కారణంగా భావించవచ్చు



అయ్యన్న ఇంటి వద్ద నాయకుల సందడి

# వంతెన నిర్మించరూ..

**ప్రజాశక్తి-దుంబ్రిగుడ :**

చెంపపట్టి వంతెనను నిర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గుర్మిసింగ్, ఆయా గ్రామాల గిరిజనులు రాజు, నూకరాజు, సాంబ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వంతెన నిర్మించక పోవడంతో చెంపపట్టి, శీలంగొంది, కోసంగి, ఉయ్యాలగుడ, నందివలస తదితర గ్రామాలకు వెళ్లేందుకు గిరిజనులు అవస్థలు పడాల్సి వస్తుందని తెలిపారు. వర్షాలకు గెడ్డ పొంగి ప్రవహిస్తుండటంతో రాక పోకలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా గ్రామాల్లోని గిరిజనులు జ్వారాల బారిన పడితే ఆసుపత్రికి తీసుకుని వెళ్లేందుకు గెడ్డను దాటే సమయంలో నానా అవస్థలు పడుతున్నామని తెలిపారు. అధికారులకు పలుమార్లు ఈ సమస్యను పరిష్కరించాలని కోరినా స్పందించ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మించి గిరిజనుల కష్టాలను తీర్చాలని వారు కోరారు.